క్లుప్తంగా

17న మండల సర్వసభ్య సమావేశం

గోకవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో ఈ నెల 17న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ కేవీఎస్ఎస్ మూర్తి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ సుంకర శ్రీవల్లి అధ్యక్షతన జరిగే సమావేశంలో అభివృద్ధి పనులు, ప్రజాసమస్యలపై చర్చిస్తారన్నారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

ఉపాధి పనుల తనిఖీ



తేటగుంటలో ఉపాధి మస్తర్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ విద్యాసాగర్ కుమార్

తుని రూరల్: మండలంలోని తేటగుంట గ్రామ చెరువుల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఎంపీడీఓ విద్యాసాగర్ కుమార్ తనిఖీ చేశారు. మస్టర్ రోల్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. చెరువుల్లో పూడికతీత పనులు సులభంగా చేయవచ్చని, దీంతో గరిష్ఠంగా రోజుకూలి రూ.272 పొందవచ్చన్నారు. బినామీ మస్తర్లు లేకుండా చూడాల్సిన బాధ్యత కూలీలపై ఉందన్నారు. చేసిన పనికి సక్రమంగా కూలి పడింది, లేనిదీ ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలన్నారు. కూలీలు సంఖ్య పెంచేందుకు ఫీల్డ్ అసిస్టెంట్, మేట్‌లు కృషి చేయాలని సూచించారు.

లో ఓల్టేజీ సమస్యకు మోక్షం



బిళ్లనందూరులో ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన ఎంపీపీ లగుడు శ్రీనివాసు

కోటనందూరు: మండలంలోని బిళ్లనందూరులో లోఓల్టేజీ సమస్యకు పరిష్కారం లభించింది. చాలా కాలంగా లో ఓల్టేజీ సమస్య గ్రామస్తులను వేధిస్తోంది. రిఫ్రిజిరేటర్లు, ఏసీలు పని చేయకపోవడంతో పాటు పూర్తిస్థాయిలో లైట్లు వెలిగే పరిస్థితి ఉండేది కాదు. ఎంపీపీ లగుడు శ్రీనివాసు కృషితో విద్యుత్ శాఖ అధికారులు కొత్తగా 16 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. గురువారం నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎంపీపీ లగుడు శ్రీనివాసు ప్రారంభించారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ట్రాన్స్ కో ఏఈ లోవరాజు, లైన్‌మన్ చిన అప్పారావు, ఎనర్జీ అసిస్టెంట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల కాపరి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై స్వామినాయుడు

కోటనందూరు: ప్రమాదవశాత్తూ వాగులో పడి గొర్రెల కాపరి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పీవీసీ స్వామినాయుడు తెలిపారు. వివరాల్లోకి వెళితే..అనకాపల్లి జిల్లా ఉప్మాక పంచాయతీ కొత్రవాని పాలేనికి చెందిన చొప్పా నరశింహులు (60) మండలంలోని భీమవరపుకోటలో గత కొంతకాలంగా నివాసం ఉంటున్నాడు. గురువారం భీమవరపుకోట నుంచి కాకరాపల్లి శివారు ఉప్పరగూడెం గొర్రెలను తోలుకెళ్లిన నశింహులు ఆ ప్రాంతంలో ఉన్న వెదుళ్లగెడ్డలో ప్రమాదవశాత్తూ పడి మృతి చెందాడు. మృతుడి కుమారుడు చొప్పా చక్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై స్వామినాయుడు కేసు నమోదు చేశారు.

సమస్యల పరిష్కారానికి శిక్షణ దోహదం

సామర్లకోట: పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజుల శిక్షణను గురువారం స్థానిక ఈటీసీలో ప్రారంభించారు. కోనసీమ, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి ఈఓ పీఆర్డీలు, సీనియర్ పంచాయతీ కార్యదర్శులు మాస్టర్ ట్రైనీలుగా ఎంపిక అయ్యారు. గ్రామాలలోని సమస్యలపై అవగాహన లేక పోవడంతో సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. శిక్షణలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఒకేచోట చేరడం వల్ల సమస్యలపై చర్చించడం ద్వారా పరిష్కార మార్గం లభిస్తుందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ కమిషనర్, ఈటీసీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఇ.కృష్ణమోహన్ అన్నారు. పంచాయతీ రాజ్ చట్టాలపై అవగాహన పెంచుకుని, శిక్షణలో నేర్చుకున్న అంశాలపై ఆయా జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇవ్వాలన్నారు. ఇప్పటికే పంచాయతీ సర్పంచ్‌లకు శిక్షణ ఇచ్చామని తెలిపారు.

అసంపూర్తి పనులు.. ప్రజలకు అవస్థలు

- ఏలేశ్వరంలో నిలిచిపోయిన డ్రైన్ల నిర్మాణం
- ప్రభుత్వ నిధులు వృథా
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రజలు



రహదారి కంటే ఎత్తుగా ఉండడంతో పాటు అసంపూర్తిగా నిలిచిపోయిన డ్రైన్ నిర్మాణ పనులు



వర్షానికి యర్రవరం రోడ్డులో నిలిచిపోయిన నీరు

ఏలేశ్వరం: కొండను తవ్వి ఎలుకను పట్టినట్టుగా ఉంది ఏలేశ్వరం నగర పంచాయతీ పరిస్థితి. నగర పంచాయతీ అభివృద్ధి పేరుతో అట్టహాసంగా ప్రారంభించిన డ్రైన్ల నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానరహదారులకు ఇరువైపులా చేపట్టిన డ్రైన్ల నిర్మాణం అక్కరకు రాకుండా పోయిందనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. నూతనంగా నిర్మించిన డ్రైన్లపై దుకాణాదారులు సిమ్మెంట్ దిమ్మలు వేసి మూసివేశారు. దీంతో మురుగు నీరు పోయే మాటెలా ఉన్నా నిర్మించిన డ్రైన్లు మూసివేయడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు.

రూ.2 కోట్లతో...

14వ ఆర్థిక సంఘం నిధులు రూ.2 కోట్లతో యర్రవరం రోడ్డు, నర్సీపట్నం రోడ్డు, పాతఅడ్డతీగల రోడ్డు, లింగంపర్తి రోడ్డులకు ఇరువైపులా డ్రైన్ల నిర్మాణ పనులు చేపట్టారు. ఏ ముహూర్తన పనులు మొదలు పెట్టారో కాని ఆది నుంచి నిర్మాణ పనులు వివాదాస్పదంగా మారాయి. పనులు ప్రారంభం నుంచి ఆటంకాలు కలుగుతుండగా, వీటిని పరిష్కరించడంలో అధికారులు విఫలమవుతున్నారు. ముందుగా ఒక రహదారికి డ్రైన్ నిర్మాణం పూర్తయిన తరువాత మరో రహదారికి డ్రైన్ నిర్మాణం చేపట్టడం ఆనవాయితీ. దీనికి విరుద్ధంగా నాలుగు రహదారులకు ఒకేసారి డ్రైన్ల నిర్మాణం చేపట్టి అన్నింటినీ అసంపూర్తిగా వదిలివేశారు. దీనిపై స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నిర్మాణ పనులపై విమర్శలు

నిబంధనలకు విరుద్ధంగా డ్రైన్ల నిర్మాణం చేపట్టడంపై విమర్శలు వస్తున్నాయి. నిబంధనల ప్రకారం రహదారి కంటే డ్రైన్లు దిగువున ఉంటాయి. దీనికి విరుద్ధంగా రహదారి కంటే డ్రైన్ అడుగు ఎత్తులో ఉండడం విశేషం. అలాగే డ్రైన్లలో నీరు పోయే మార్గం లేకుండా ఎక్కడికక్కడే అసంపూర్తిగా వదిలేశారు. నాలుగు రహదారులను అనుకుని నిర్మించిన ఏ ఒక్క డ్రైన్ నిర్మాణం కూడా పూర్తి కాలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు పోయే మార్గం లేకపోవడంతో రహదారిపై నిలిచిపోయింది. దీంతో వర్షాలు పడితే రహదారులపై వెళ్లాలంటే వాహనదారులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో డ్రైన్ల నుంచి నీరు పోయే మార్గం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

నిర్మాణ పనులు పూర్తి చేస్తాం



పట్టణంలో డ్రైన్ల నిర్మాణ పనులను త్వరలోనే పూర్తి చేస్తాం. నగర పంచాయతీ జనరల్ నిధులను డ్రైన్ల నిర్మాణానికి కేటాయిస్తాం. పట్టణంలో వర్షం నీరు నిలిచిపోకుండా డ్రైన్ల ద్వారా పోయేలా చర్యలు తీసుకుంటాం. డ్రైన్ల నిర్మాణ పనులకు ప్రజలు సహకరించాలి.

– కేపీ కొండలరావు, కమిషనర్, నగర పంచాయతీ, ఏలేశ్వరం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలేశ్వరం: పట్టణంలోని జగనన్న కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసే విద్యుత్ సబ్‌స్టేషన్‌కు కొత్త లైన్ వేసే పనుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జగ్గంపేట ఈఈ కె.రత్నాలరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం, నందివీధి, పెద్దవీధి, కప్పలచెరువు తదితర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరాఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

తొండంగి మండలంలో...

తొండంగి: మండలంలోని ఏవీ నగరం, అన్నయ్యపేట విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఈఈ రత్నాలరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని ఏవీ నగరం, పెరుమాళ్లపురం, పాత చోడిపల్లిపేట, కొత్తచోడిపల్లిపేట, జీఎం పేట, ఎల్లయ్యపేట, యర్రయ్యపేట తదితర గ్రామాల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఉపాధి కూలీల ఆందోళన



రమణయ్యపేటలో తిమ్మరాజుచెరువు వద్ద ఆందోళన చేస్తున్న ఉపాధి కూలీలు

ఏలేశ్వరం: తమకు వేతనాలు చెల్లించడం లేదంటూ ఉపాధికూలీలు గురువారం ఆందోళన చేశారు. మండలపరిధిలోని రమణయ్యపేట తిమ్మరాజుచెరువులో పని చేస్తున్న ఉపాధికూలీలు తమకు వేతనాలు చెల్లించాలంటూ ఆందోళన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము పనిచేసిన పనులకు కూలి సొమ్ములు ఇవ్వడం లేదన్నారు. ఉపాధి సిబ్బంది తమకు వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. చెరువులో పూడికతీత పనులకు సబంధించి ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్ సుమారు రూ.3 లక్షల వేతనాలను నిలిపివేశారన్నారు. గతంలో చేసిన పనులకు వేతనాలు ఇవ్వకుండా అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు.

అగ్నిప్రమాదంలో బ్యూటీపార్లర్ దగ్ధం

తొండంగి: స్థానిక మెయిన్‌రోడ్డులో గురువారం తెల్లవారుజామున సంభవించిన అగ్నిప్రమాదంలో బ్యూటీ పార్లర్ దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే.. బ్యూటీషియన్ టి.జ్యోతి తన బ్యూటీ పార్లర్‌ను బుధవారం రాత్రి యథావిధిగా మూసివేసి ఇంటి వెళ్లిపోయింది. తెల్లవారుజామున షాపు నుంచి పెద్ద ఎత్తున మంటలు రావడంతో స్థానికులు గమనించి సమాచారం అందించారు. వెంటనే తుని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో పాటు స్థానికులు మంటలు అదుపుచేసే ప్రయత్నం చేశారు. అప్పటికే షాపులో ఫర్నీచర్, ఏసీ, కాస్మోటిక్స్ కాలి బూడిదయ్యాయి. రెవెన్యూ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. దీనిపై సమగ్ర నివేదిక అందించాలని అధికారులను ఆదేశించినట్టు తహసీల్దార్ సుబ్రహ్మణ్యం తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లనే ఈ ప్రమాదం జరిగిందని, సుమారు రూ.3 లక్షల ఆస్తినష్టం సంభవించినట్టు ప్రాథమికంగా అంచనా వేశారు.

ఎన్‌సీసీలో శ్రీప్రకాష్ విద్యార్థినుల ప్రతిభ



పతకాలు, ప్రశంసా పత్రాలతో శ్రీప్రకాష్ ఎన్‌సీసీ క్యాడెట్లు

తుని: కాకినాడ ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో పెద్దాపురం జవహర్ నవోదయలో నిర్వహించిన మూడో ఆంధ్రా బాలికల బెటాలియన్ వార్షిక శిక్షణ శిబిరంలో స్థానిక శ్రీప్రకాష్ విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. కమాండింగ్ అధికారి తుష్యంత కులశ్రేష్ఠ ఆధ్వర్యంలో మే 1 నుంచి 10 వరకూ జరిగిన ఈ శిక్షణలో 600 మంది జూనియర్, సీనియర్ క్యాడెట్లు పాల్గొన్నారు. ఈ శిబిరంలో ఎన్‌సీసీ శిక్షణతో పాటు పలు సాంస్కృతిక, ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో శ్రీప్రకాష్ ఎన్‌సీసీ జట్టు 19 బంగారు మెడల్స్, 3 రజిత పతకాలు గెలుచుకుని ప్రథమస్థానంలో నిలిచింది. ప్రతిభ చూపిన క్యాడెట్లను విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, ఏఎన్ఓ బషీర్ అభినందించారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీసీసీబీ సీఈఓ నరసింహారావు

ఏలేశ్వరం: విద్యార్థులు నైపుణ్యాలు, కమ్యూనికేషన్స్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని డీసీసీబీ సీఈఓ ఆర్‌వీ నరసింహారావు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన తృతీయ సంవత్సరం విద్యార్థులకు గురువారం ఇంటర్న్‌షిప్, అలాట్‌మెంట్‌లపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత ఉద్యోగాలు పొందాలంటే నైపుణ్యాలు కలిగి ఉండాలన్నారు. తాము తీసుకున్న సబ్జెక్టులపై పట్టు సాధించాలన్నారు. నైపుణ్యం కలిగిన విద్యార్థులకు తమ బ్యాంక్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు, వికాస మేనేజర్ శర్మ, పట్టణానికి చెందిన పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడమ్మతల్లి పండగ



మరిడమ్మ తల్లికి నైవేద్యం తీసుకు వెళుతున్న భక్తులు

కిర్లంపూడి: సోమరాజుపేటలో వేంచేసిన మరిడమ్మ తల్లి పండగ గురువారం ఘనంగా జరిగింది. గ్రామానికి చెందిన పలువురు భక్తులు వీధులలో చీరలపై నడుస్తూ ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన



శంఖవరం జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ పర్వత రాజబాబు

శంఖవరం: కులమతాలు, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం అర్హులందరికీ పక్కా ఇళ్లు మంజూరు చేసిందని ఎంపీపీ పర్వత రాజబాబు అన్నారు. స్థానిక జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వం జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు కేటాయించిందన్నారు. సొంత స్థలాలు ఉండి ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చింతనీడి కుమార్, బైరా శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై పోరాటం

గోకవరం: జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ డిపోల్లోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తామని ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు పైడిమళ్ల లక్ష్మణ్‌రావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు, ప్రమోషన్ల విషయంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులపై అవమానాలు జరుగుతున్నాయన్నారు. దీనిపై నిరంతర పోరాటం చేసేందుకు జిల్లా వ్యాప్తంగా సమావేశాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

ఈదురుగాలులతో భారీ వర్షం



కిర్లంపూడి-రాజుపాలెం ప్రధాన రహదారిపై పడిన చెట్టును తొలగిస్తున్న దృశ్యం



ప్రత్తిపాడులో పిడుగు పడి దగ్ధమవుతున్న కొబ్బరిచెట్టు

ఏలేశ్వరం: మండలవ్యాప్తంగా గురువారం ఈదురుగాలులతో కూడిన భారీవర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రంగా ఉండగా మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఈదురుగాలులతో వర్షం పడింది. ప్రధాన రహదారులపై నీరు నిలిచిపోయింది. ఈదురుగాలులకు అరటితోటలు నేలకొరిగాయి. విద్యుత్ సరాఫరా నిలిపివేశారు. ఉదయం నుంచి ఉక్కపోతతో ఇబ్బందులుపడ్డ ప్రజలు ఒక్కసారిగా వర్షం పడడంతో ఉపశమనం పొందారు.

పిడుగు పడి కొబ్బరి చెట్టు దగ్ధం

ప్రత్తిపాడు: గ్రామంలో గురువారం సాయంత్రం పిడుగు పడి కొబ్బరి చెట్టు దగ్ధమైంది. ఉదయం నుంచి వేసవి తాపంతో ప్రజలు అల్లాడిపోయారు. 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. అత్యవసర పనులుంటే తప్ప బయటకు రాలేదు. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. స్థానిక శిరసాల వారి వీధిలో శిరసాల నాగమణి ఇంటి ఆవరణలో ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడి దగ్ధమైంది. స్థానిక అగ్నిమాపక సిబ్బంది సకాలంలో సంఘటన స్థలానికి చేరుకుని, మంటలను అదుపులోకి తెచ్చారు. మండల వ్యాప్తంగా ఓ మోస్తరు వర్షం కురిసింది.

నేలకొరిగిన భారీ వృక్షం

కిర్లంపూడి: మండల వ్యాప్తంగా గురువారం సాయంత్రం ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి రాజుపాలెం నుంచి కిర్లంపూడి వచ్చే ప్రధాన రహదారిలో భారీ వృక్షం నేలకొరిగింది. దీంతో ఆ రహదారి గుండా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై టి.రఘునాథరావు పోలీసు సిబ్బందితో వెళ్లి జేసీబీ సహాయంతో చెట్టును తొలగించారు.

వచ్చే నెల 11న ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

తుని రూరల్: మండలంలోని హంసవరం ఆదర్శ పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతిలో చేరేందుకు జూన్ 11న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ పద్మజ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2022-23లో ఐదో తరగతి చదువుతూ పై తరగతికి అర్హత సాధించిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు 2011 సెప్టెంబర్ ఒకటి నుంచి 2013 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2009 సెప్టెంబర్ ఒకటి నుంచి 2013 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలన్నారు. ప్రవేశపరీక్ష జూన్ 11న ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతుందన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు 35 మార్కులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 30 మార్కులు సాధించాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 25వ తేదీలోగా సీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఐఎన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 70329 96442 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అవినీతిపై ఫిర్యాదు

కిర్లంపూడి: మండలంలో జరుగుతున్న అవినీతిని రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేయాలని మండల బీజేపీ అధ్యక్షులు యడాలి రాంబాబు కోరారు. ఈ మేరకు గురువారం బీజేపీ నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ గోనేడలో కమ్మరి పని చేసుకుంటూ జీవిస్తున్న వారి పాకలు తీసివేయడంతో పాటు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పలు పథకాలు అర్హులకు అందడం లేదన్నారు. దీంతో ప్రభుత్వంపై కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు సింగిలిదేవి సత్తిరాజు, జ్యోతుల దుర్గాప్రసాద్, పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వడగాడ్పులపై అప్రమత్తంగా ఉండాలి



కాకరాపల్లిలో ఇటుకబట్టీ కార్మికులకు అవగాహన కల్పిస్తున్న ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్

కోటనందూరు: వడగాడ్పుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పంచాయతీ విస్తరణాధికారి జి.అరుణ్‌కుమార్ సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం మండలంలోని కాకరాపల్లి ఇటుక బట్టీల్లో కార్మికులు, ఉపాధిహామీ పని ప్రాంతాల్లో కూలీలతో ఆయన మాట్లాడారు. తుపానుల ప్రభావంతో వచ్చే వారం రోజుల్లో భారీగా వడగాల్పులు వీచే అవకాశం ఉందన్నారు. పని సమయంలో వీలైనంత వరకూ తెల్లని దుస్తులు ధరించాలని, తలకు రక్షణ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఉదయం 11 గంటల వరకే పని చేయాలని తిరిగి సాయంత్రం వడగాడ్పులు తగ్గిన తరువాత పని కొనసాగించాలన్నారు. వీలైనంత ఎక్కువగా మంచినీరు, మజ్జిగ, నిమ్మరసం వంటివి తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి పంపన జయలక్ష్మి, గ్రామ మహిళ సంరక్షణ కార్యదర్శి చిటికెల సీతాదేవి పాల్గొన్నారు.

టెన్త్‌లో ప్రతిభ చూపిన విద్యార్థినికి అభినందనలు



జిల్లా కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న అక్షయ

జగ్గంపేట: మండలంలోని రాజపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని సంగన అక్షయ పదో తరగతి పరీక్షల్లో 585 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరించింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా గురువారం కాకినాడలో అక్షయను అభినందించి ఓ పుస్తకాన్ని బహుమతిగా అందజేశారు. రాజపూడి హైస్కూల్ ఉపాధ్యాయులను కూడా కలెక్టర్ ప్రశంసించారు. అక్షయ జగ్గంపేట నియోజకవర్గంలో అత్యధిక మార్కులు సాధించిన వారిలో ప్రథమ స్థానంలోనూ, పిఠాపురం డివిజన్‌లో ద్వితీయ స్థానంలోనూ నిలిచిందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో రాజపూడి హెచ్‌ఎం సాల్మన్‌రాజు, విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తుని: పాయకరావుపేట గవర్నమెంట్ ఐటీఐలో 2023-24 విద్యాసంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ గురువారం తెలిపారు. అభ్యర్థులు అన్ని సర్టిఫికెట్స్‌తో ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో జూన్ 6వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రిజిస్ట్రేషన్ కోసం పదో తరగతి మార్కుల లిస్టు, కుల ధ్రువపత్రం, ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటో, మొబైల్ నంబర్ అవసరమవుతాయని చెప్పారు. ధ్రువపత్రాల పరిశీలన, కౌన్సెలింగ్ తేదీలను త్వరలో తెలియజేస్తామన్నారు. ఐటీఐలో దరఖాస్తు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ సౌకర్యం ఉందని ప్రిన్సిపల్ వివరించారు.

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో 2023-24 సంవత్సరానికి గాను మొదటి విడత ప్రవేశానికి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎల్ఆర్ఆర్ కృష్ణన్ గురువారం తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, సివిల్ ట్రేడ్లకు సంబంధించి అభ్యర్థులు ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుదారులు తమ యూనిక్ ఐడీ నంబర్, ఒరిజినల్ సర్టిఫికెట్లను ఐటీఐలో పరిశీలన చేయించుకుని ప్రిన్సిపల్ ఆమోదం పొందాలన్నారు. మరిన్ని వివరాలకు 95020 89936, 93462 98918, 91009 72825 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.